# 17వ పాఠం
# చెట్టు 0పుట్ట, రాయి రప్పల ద్వారా శుభాన్ని ఆశించటం

అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవిచ్చాడు:

**"ఏమిటీ, మీరు లాత్, ఉజ్జాలను గాని చూశారా? మూడవది, చివరిది అయిన (అరబ్బుల ఆరాధ్య దైవం) మనాతును (కూడా చూశారా?)........."** ***(ఖుర్ఆన్ 53 : 19, 20)***

అరబ్బు బహుదైవారాధకులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. అరబ్బు ద్వీపంలో ఖ్యాతి గడించిన మూడు దేవతల పేర్లు ఇవి. **మొదటిది,** 'లాత్'. అరబ్బు పూజారులు తమ మెడలను ఆ దేవతా విగ్రహం వైపుకు త్రిప్పేవారు. దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. **రెండవది,** 'ఉజ్జా'. 'గిత్ఫాన్' ప్రాంతంలో 'ఉజ్జా' అనే ఒక వృక్షం ఉండేది. జనులు దాన్ని పూజించేవారు. దాన్ని మొక్కుకునేవారు. ముఖ్యంగా ఖురైషు, కినానా తెగవారు దీన్ని కొలిచేవారు.

**మూడవది,** 'మనాత్'. ఈ దేవత మెప్పు పొందటం కోసం జనులు దాని ముందు జంతు బలి ఇచ్చి రక్తం ప్రవహింపజేసేవారు. ఈ విగ్రహం మక్కా – మదీనా ప్రాంతాల మధ్య ఉండేది (ఫత్‌హుల్ ఖదీర్). బనూ ఖుజాఅ తెగవారి ప్రత్యేక దేవత ఇది. అజ్ఞాన కాలంలో ఔస్, ఖజ్రజ్ తెగలవారు హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు ఈ స్థలం (విగ్రహం) వద్దనే 'ఇహ్రామ్' (దీక్ష) బూనేవారు. ఆ విగ్రహం చుట్టూ వారు ప్రదక్షిణ కూడా చేసేవారు. (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

ఇవిగాక ఆ పరిసర ప్రాంతాల్లో మరికొన్ని చిట్టిపొట్టి దేవుళ్ళ బొమ్మలు,

https://teluguislam.net

దేవాలయాలు కూడా ఉండేవి. మక్కా విజయం తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ విగ్రహాలను, విగ్రహారాధనాలయాలను నిర్మూలించారు. విగ్రహాలపై వెలసిన గుమ్మటాలను, పక్కా నిర్మాణాలను కూడా నేలమట్టం చేశారు. పూజా పునస్కారాలకు కేంద్రాలుగా మారిన చెట్లను కూడా నరికించివేశారు. విగ్రహారాధనకు ప్రతిరూపాలుగా ఉన్న ఇతరత్రా చిహ్నాలను కూడా రూపుమాపారు.

అబూ వాఖిద్ లైసీ (రజి) కథనం: "మేము దైవ ప్రవక్త (సఅసం)తో కలిసి హునైన్ యుద్ధానికి వెళుతున్నాము. మేము అప్పుడప్పుడే అవిశ్వాస స్థితి నుంచి ఇస్లాం వైపు మరలిన వాళ్ళం. ఆ కాలంలో ఒక రేగిచెట్టు ఉండేది. బహుదైవారాధకులు ఆ చెట్టును ప్రార్థించేవారు. తమ ఆయుధాలను ఆ చెట్టుకు వ్రేలాడదీసేవారు. ఆ చెట్టు 'జాతు అన్వాత్'గా పిలువబడేది.

మేము ప్రయాణంలో ఒక రేగి చెట్టును సమీపించాము. అప్పుడు మేము, 'ఓ దైవప్రవక్తా (స)! బహుదైవారాధకులకు శుభం పొందేందుకు జాతె అన్వాత్ ఉన్నట్లే మా కోసం కూడా ఒక 'జాతె అన్వాత్'ని నిర్ధారించండి' అన్నాము. సమాధానంగా దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు (ఆశ్చర్యంగా): "అల్లాహు అక్బర్! (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు). ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నా. ఇవన్నీ పూర్వీకుల పోకడలు! ప్రవక్త మూసా (అలైహిస్సలాం)ను ఆయన అనుచరులైన ఇస్రాయీల్ సంతతివారు కోరిందే (ఈనాడు) మీరూ కోరుతున్నారు – 'ఓ మూసా! వారికి ఏ విధంగా దేవుళ్లు ఉన్నారో అదే విధంగా మాకూ ఒక దైవాన్ని (విగ్రహాన్ని) కల్పించు' అని (గతంలో) వారు కోరివున్నారు. అప్పుడు మూసా (అలైహి), 'నిజంగానే మీరు మూర్ఖజనులు' అని నొచ్చుకున్నారు.

https://teluguislam.net

(ఆ తరువాత) దైవప్రవక్త (సఅసం), "మీరు కూడా మీకు పూర్వం గతించిన వారి అడుగుజాడల్లో నడుస్తారు" అని చెప్పారు. (తిర్మిజీ – ప్రామాణిక హదీసు)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- ఇస్లాంలో అప్పుడప్పుడే ప్రవేశించిన నూతన ముస్లిం సహచరులు 'జాతె అన్వాత్' లాంటిది మరేదన్నా శుభం కోసం నిర్ధారించమని విన్నవించుకున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఆశ్చర్యంతోపాటు ఆవేదన కూడా చెందారు. అందుకే ఆయన (స), "అల్లాహు అక్బర్! ఇవి గత జాతుల పోకడలయ్యా!" అని మందలించారు – ఇది గమనార్హ విషయం.
- ఈ విధంగా చెట్టు నుండి శుభం ఆశించటం షిర్క్ క్రిందికి వస్తుందన్న సంగతి ఆ నవముస్లిం సహాబీలకు తెలీదు. అందుకే వారలా కోరారు.
- దైవప్రవక్త సహచరులే అజ్ఞానం చేత షిర్క్ కార్యాలకు ఒడిగట్టే అవకాశం వున్నప్పుడు తర్వాతి తరాల వారికి ఆ ప్రమాదం ఇంకా ఎక్కువ ఉంటుంది.
- **షిర్క్ రెండు రకాలు :** (1) చిన్న షిర్క్ (2) పెద్ద షిర్క్.
- ప్రవక్త ప్రియసహచరులు తమకు తెలియని విషయంపై సందేహ పడ్డారేగాని, దానిని అమలు పరచలేదు. "అలా చేయకూడదు" అని చెప్పిన తరువాత దాన్ని పూర్తిగా మానుకున్నారు.
- షిర్క్‌కు దారితీసే దారుల్ని మూసేయాలి. అజ్ఞానం చేత అవిశ్వాస పోకడలను అనుసరిస్తున్నవారిని జాగరూకపరచి అడ్డుకోవాలి.

https://teluguislam.net

- దైవప్రవక్త (స) తన సహచరులకు విషయాన్ని విడమరచి చెబుతున్నప్పుడు, "ఇవి గతించిన వారి పద్ధతులు" అని సర్వసాధారణ రీతిలో బోధించటం గమనించదగినది.
- అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో యూదుల, క్రైస్తవుల ఏ ఏ పోకడలను గురించి హెచ్చరించాడో వాటిపట్ల మనం కూడా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఆ చేష్టలు మనకు కూడా వ్యతిరేకంగా పరిణమిస్తాయి.
- చెడు భావాల నుండి సవ్యమైన భావాల వైపునకు, చెడు వాతావరణం నుండి శుభప్రదమైన వ్యవస్థ వైపునకు కొత్తగా మరలి వచ్చిన వారిలో కొన్ని పాత అలవాట్లు ఉంటాయి. అలాంటి వారు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పసిగట్టి, దిద్దుబాటలో ముందుకు సాగాలి.

## మోడల్ ప్రశ్నలు

1) అర్రుఖా, తమాయిమ్, మరియు తివలహ్ పదాలను వివరించండి?
2) 'జాతు అన్వాత్' సంఘటనను వివరించండి?
3) మూసా ప్రవక్త తన అనుచరుల పట్ల ఎందుకు నొచ్చుకున్నారు?
4) అరబ్బు బహుదైవారాధకులు వారు సృష్టించుకున్న దేవతలను ఏ విధంగా కొలిచేవారు?

https://teluguislam.net